సాక్షి
జనగామ
బుధవారం । 19 । జూలై । 2023



రాష్ట్రంలో నిరంతర ఉచిత విద్యుత్ - 8లో▸

రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ నిరంతరంగా ఉచిత విద్యుత్ ఇస్తున్నారని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు.



కొలువు..గెలువు

పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న మైనార్టీ అభ్యర్థులకు మైనార్టీస్ స్టడీ సర్కిల్, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందించనుంది. - 8లో▸

గరిష్టం/కనిష్టం
28.0⁰ /24.0⁰

వాతావరణం

అల్పపీడన ప్రభావంతో జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు.

న్యూస్‌రీల్

దారిచూపే వరకు పోరాటం ఆగదు



జనగామ: కాలనీకి దారిచూపే వరకు పోరాటం ఆగదని దుర్గాకాలనీ వాసులు తెల్చిచెప్పారు. దేవాదాయ శాఖ అధికారులు ఇటీవల కాలనీకి వెళ్లే దారిని మూసివేయగా, 150 కుటుంబాలు రోడ్డెక్కి న్యాయం కోసం పోరాడుతున్నారు. జనగామ పట్టణం సూర్యాపేటరోడ్డు కలెక్టరేట్ ఎదురుగా ఉన్న దుర్గా కాలనీ వాసులు చేపట్టిన నిరసన దీక్షలు మంగళవారం నాటికి నాలుగో రోజుకు చేరుకోగా, మహిళలు న్యాయం కోసం నినదించారు. స్థానిక కౌన్సిలర్ వాంకుడోతు అనిత వారికి మద్దతు పలికారు. అనంతరం కాలనీ మహిళలు మాట్లాడుతూ మున్సిపల్‌లో అనుమతులు తీసుకున్న తర్వాతనే ఇంటి నిర్మాణం చేసుకున్నామన్నారు. 150 కుటుంబాల కష్టాలను దృష్టిలో ఉంచుకుని, అధికారులు స్పందించి కాలనీకి దారి చూపించాలన్నారు. అనంతరం కలెక్టరేట్‌కు వెళ్లి సంబంధిత అధికారులకు వినతిపత్రం సమర్పించారు. కాలనీ కమిటీ గౌరవ అధ్యక్షుడు బ్యంగి భాస్కర్, అధ్యక్షుడు కోటి రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్, ఎండీ పాషా, కార్యదర్శులు దండు శ్రీను, శ్రీధర్ రెడ్డి, ట్రెజరర్ అజ్మీర వంశీ, తదితరులు ఉన్నారు.

రేపు వ్యాసరచన పోటీలు

చిల్పూరు: జాతీయస్థాయి ప్లాస్టిక్ రహిత దినోత్సవం సందర్భంగా ఈనెల 20న హైస్కూల్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించనున్నట్లు తెలంగాణ గోశాల ఫెడరేషన్ దళిత మహిళా గోరక్షణ అధ్యక్షురాలు మోతె విజయరాణి, నర్సయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8, 9, 10వ తరగతి చదివే విద్యార్థులకు సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకాన్ని ఎలా తగ్గించాలి అనే అంశంపై వ్యాస రచన పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంట్రీ విజేతలను జిల్లా స్థాయి పరిగనలోకి తీసుకుని స్క్రీనింగ్ చేసి రాష్ట్ర స్థాయి పోటీలకు తీసుకుంటారన్నారు. పూర్తి వివరాలకు 9394005600, 9573242205 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సమస్యలకు నిలయంగా ఎస్టీ హాస్టళ్లు



స్టేషన్‌ఘన్‌పూర్: జిల్లా వ్యాప్తంగా ఉన్న గిరిజన బాలుర వసతి గృహాలు సమస్యలకు నిలయంగా మారాయని, సమస్యల పరిష్కారంలో డీటీడబ్ల్యూఓ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మబిక్షం అన్నారు. డివిజన్ కేంద్రంలోని పలు సంక్షేమ వసతి గృహాలను ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా బృందం సందర్శించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన సంఘం జిల్లా కార్యదర్శి ధర్మబిక్షం మాట్లాడుతూ స్థానిక గిరిజన బాలుర వసతిగృహంలో అపరిశుభ్ర వాతావరణం ఉందని, బాత్‌రూమ్ సౌకర్యాలు అధ్వాన్నంగా ఉన్నాయన్నారు. హాస్టల్ వార్డెన్ స్థానికంగా లేరని, ఈ విషయమై ఐటీడీఏ పీఓకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు వికాష్, గణేష్, వినయ్, అంజలి తదితరులు పాల్గొన్నారు.

విస్నూరు ఒగ్గు కళాకారుల ప్రతిభ



పాలకుర్తి టౌన్: విస్నూరు గ్రామానికి చెందిన ఒగ్గు కళాకారులు హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర బోనాల సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని ప్రథమ బహుమతిని పొందారు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన వివిధ కళా ప్రదర్శనల్లో పాలకుర్తి మండలం విస్నూరు గ్రామం నుంచి కళాకారులు రేణుక ఎల్లమ్మ ఒగ్గు కథను ఆకట్టుకునేలా ప్రదర్శించారు. దీంతో వారికి ప్రథమ బహుమతి లభించింది. కళాకారులు తపస్వి, పరశురాముడు, వాసూరి శ్రీశైలం, జోగు ప్రశాంత్, చందు, నవీన్‌లు ప్రథమ బహుమతిని పొందారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శన

కాళేశ్వరం: సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ, ఆయన స్నేహితులు మంగళవారం కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించారు. కాళేశ్వరంలోని శ్రీ కాళేశ్వర ముక్తీశ్వరుడిని దర్శించుకున్నారు. అనంతరం కన్నెపల్లిలోని లక్ష్మీపంపుహౌస్ డెలివరి సిస్టర్న్ వద్ద మోటార్లు ఎత్తిపోస్తున్న జలాలను చూశారు. ఆటోస్టార్ట్ పద్ధతిలో నడుస్తున్న మోటార్లను పరిశీలించారు. ఆయనకు ఇరిగేషన్ ఈఈ తిరుపతిరావు ప్రాజెక్టు స్వరూపాన్ని వివరించారు.

నులిపురుగులను నలిపేద్దాం

జిల్లాకు చేరుకున్న 1.78 లక్షల మాత్రలు

- 1 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు వేసేందుకు సర్వం సిద్ధం
- రేపు జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవం
- పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ శివలింగయ్య



నివారణ చర్యలు

- భోజనానికి ముందు చేతులను శుభ్రం చేసుకోవాలి.
- సురక్షిత, కాచి వడబోసిన తాగునీటిని తీసుకోవాలి
- తీపి పదార్థాలను పిల్లలకు దూరంగా ఉంచాలి
- మలబద్ధకం రాకుండా చూసుకోవాలి
- పీచు పదార్థాలు ఉన్న ఆహారాన్ని ఎక్కువగా ఇవ్వాలి

జనగామ: నులిపురుగు పిల్లల పాలిట శాపం. వ్యక్తిగత పరిశుభ్రత లోపించిన పిల్లల కడుపులో నులిపురుగు పెరుగుతూ.. బరువు తగ్గేందుకు కారణమవుతాయి. రక్తహీనత, పోషక లోపం, ఆకలి లేకపోవడం, కడుపునొప్పి, బలహీనతగా తయారవు తారు. ఏలికపాము, నులి, కొంకి, ఇలా మూడు రకాల పురుగులు కలిగి ఉన్న పిల్లవాడు.. క్రమేనా బరువు తగ్గిపోతూ.. అనారోగ్య కారణాలతో ఇబ్బందులు పడుతారు. పిల్లల ఎదుగుదల, సంపూర్ణ ఆరోగ్యంపై దృష్టి సారించిన ప్రభుత్వం.. ఏటా రెండు సార్లు నులి పురుగుల నివారణ మాత్రలు వేస్తుంది. ఈ నెల 20వ తేదీ (రేపు) జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో చదువుకునే విద్యార్థులకు మాత్రలు వేసేందుకు వైద్యారోగ్య శాఖ సర్వం సిద్ధం చేసింది. 1 నుంచి 19ఏళ్ల లోపు 1,13,142 మంది విద్యార్థులు ఉండగా, 1.78లక్షల మాత్రలు జిల్లాకు చేరుకున్నాయి.

నులి పురుగుల వ్యాప్తి..

ఈగలు, దుమ్ము, ధూళి పడి కలుషితంగా మారిన తినుబండారాలను తీసుకోవడంతో పిల్లల కడుపులో నులిపురుగు వ్యాప్తి చెందుతుంది. కాళ్లకు చెప్పులు లేకుండా బహిరంగ ప్రదేశాలు, టాయిలెట్‌కు వెళ్లడం ద్వారా వచ్చే అవకాశం ఉంటుంది. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, వంట సరుకులను శుభ్రమైన నీటితో కడగకపోవడం, తినే ముందు, తిన్న తర్వాత చేతులు శుభ్రం చేసుకోక పోవడంతో అనేక అనర్థాలు ఉంటాయి. ఏడు రకాల నులి పురుగులు చిన్నారుల పొట్టల్లో స్థావరం ఏర్పరుచుకుని, వారి ఎదుగుదలలో ప్రభావం చూపిస్తాయి. జిల్లా, మండల టాస్క్‌ఫోర్స్ టీంల పర్యవేక్షణలో నులి మాత్రలు వేసే విధానంపై డాక్టర్లకు శిక్షణ ఇచ్చారు. విద్య, శిశు సంక్షేమ, పంచాయతీరాజ్, మున్సిపల్, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం, ఇతర మతపరమైన పాఠశాలల భాగస్వామ్యంతో నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ వందశాతం పూర్తి చేసేలా పక్కా ప్రణాళికతో ముందుకు వెళుతున్నారు. ఇందుకు సంబంధించి 16 పీహెచ్‌సీల పరిధిలో 104 సబ్ సెంటర్లు ఆధ్వర్యంలో వైద్యులు, వైద్య సిబ్బంది, 509 మంది ఆశకార్యకర్తలు ఇందు కోసం సేవలందించనున్నారు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు

పోస్టర్ ఆవిష్కరణ

జాతీయ నులి పురుగు నివారణ దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 20వ తేదీన జిల్లాలో నిర్వహించ తలపెట్టిన మాత్రల పంపిణీ పోస్టర్‌ను మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, రోహిత్ సింగ్‌లతో కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాత్రలు ఉచితంగా పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఈ మాత్రలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ వైద్యాధికారి డాక్టర్ రవీందర్, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ భాస్కర్, డాక్టర్ అశోక్ కుమార్, సీహెచ్ఓ జైపాల్ రెడ్డి, రవీందర్, కలెక్టరేట్ పరిపాలన అధికారి ఏకే మన్సూరి, మాస్ మీడియా అధికారి ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

వందశాతం పూర్తి చేసేలా..



జిల్లాలో రేపటి నుంచి (గురువారం) ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలతో పాటు కళాశాలల్లో నులి పురుగు నివారణ మాత్రలను పంపిణీ చేసేందుకు సిద్ధం చేశాం. 1 నుంచి 19 ఏళ్ల లోపు ఉన్న ప్రతి విద్యార్థికి ఈ మాత్రలు వేస్తాం. మిగిలిన పిల్లలకు తిరిగి 27వ తేదీన ఇస్తాం. మధ్యాహ్న భోజనం తర్వాత వైద్యులు, సిబ్బంది పర్యవేక్షణలో ఆల్‌బెండజోల్ (నులి పురుగు నివారణ మాత్ర) ట్యాబ్లెట్లను వేస్తాం.

- డాక్టర్ భాస్కర్, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్



జనగామలో కురుస్తున్న వర్షం

రెడ్‌జోన్‌లో జనగామ

- మూడు రోజుల పాటు భారీ వర్షాలు
- 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు
- వాతావరణశాఖ హెచ్చరిక



జోరు వర్షంలో వెళ్తున్న వాహనదారుడు

జనగామ: వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రానున్న మూడు రోజుల పాటు తేలిక పాటి, అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ శాఖ వెల్లడించింది. మంగళవారం జిల్లాలో ఉదయం మొదలైన తేలిక పాటి వర్షం, రాత్రి అయ్యే సరికి కొంతమేర పెరిగింది. మరో రెండు రోజుల పాటు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో కూడిన ఈదురు గాలులతో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తన రిపోర్టులో పేర్కొంది. వర్షప్రభావ జాబితాలో జనగామ జిల్లాను రెడ్‌జోన్‌గా ప్రకటించారు. దీంతో జిల్లా అధికారులు అలర్టయ్యారు. నేడు, రేపు వర్ష ప్రభావం తీవ్రమయ్యే అవకాశం ఉంది. భారీ వర్షాల కారణంగా ముంపుకు గురయ్యే లోతట్టు ప్రాంతాలపై దృష్టి సారించాలని సూచించారు. అలాగే రోడ్డు, రైలు మార్గాలకు సంబంధించి కల్వర్టులు, బ్రిడ్జీలపై నిఘా ఉంచారు. వరి, పత్తి ఇతర పంటలకు కొంత మేలు జరిగినప్పటికీ, భారీ వర్షాలు కురిస్తే ఎలా అనే దానిపై రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా మంగళవారం రాత్రి 7 గంటలకు వరకు 9.6 మిల్లీ మీటర్ల వర్షం కురవగా, అత్యధికంగా జనగామలో 16.8 మిల్లీ మీటర్లు, అత్యల్పంగా జఫర్‌గఢ్‌లో 3.33 మిల్లీ మీటర్ల వర్షం కురిసినట్లు సీపీఓ ఇస్మాయిల్ తెలిపారు. అలాగే జనగామ జిల్లాను రెడ్ అలర్ట్ ప్రటించడంతో విద్యుత్ శాఖ అప్రమత్తమైంది. వర్షాలు కురుస్తుండటంతో తడి చేతులతో విద్యుత్ పరికరాలు, తీగలను తాకరాదని ఎస్పీడీసీఎల్ ఎస్ఈ వేణుమాధవ్ తెలిపారు. బట్టలు ఆరేసే తీగలకు విద్యుత్ వైర్లు తాకకుండా చూసుకోవాలన్నారు. ఎక్కడైన విద్యుత్ స్తంభాలు పక్కకు ఒరిగినా, చెట్ల కొమ్మలు తగలడం వంటి ఘటనలు కనిపిస్తే వెంటనే ఎస్పీడీసీఎల్ అధికారులు, సిబ్బందికి సమాచారం అందించాలన్నారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు

- అందుబాటులో 6303928718 సేవలు

జిల్లాలో ఏకధాటిగా కరుస్తున్న వర్షాలతో యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ శివలింగయ్య ఆదేశించారు. మంగళవారం రాత్రి కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 24 గంటలు ఇందులో సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ఎటువంటి పరిస్థితులనైన ఎదుర్కొనేందుకు కంట్రోల్‌రూం నంబర్ 6303928718 కేటాయించామని, వర్షాల కారణంగా ఎటువంటి సహాయం కావాలన్నా కంట్రోల్ రూంను సంప్రదించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని నివాస ప్రాంతాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని మండల అధికారులను కోరారు. చెరువుల వద్ద నీటి నిల్వలను పరిశీలించాలని, కట్టలకు గండ్లు పడకుండా అప్రమత్తతో చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు.

అభివృద్ధి చూసి ఓర్వలేకనే విమర్శలు

- ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

జనగామ రూరల్: పోరాడి సాధించుకున్న తెలంగాణలో అభివృద్ధిని చూసి ఓర్వలేక కాంగ్రెస్, బీజేపీ పార్టీలు బీఆర్ఎస్‌పై విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఓబుల్‌కేశవాపూర్ గ్రామంలోని రైతు వేదికలో సర్పంచ్ చేర్యాల రేణుక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. నాడు తాగడానికి నీరు లేని పరిస్థితి నుంచి నేడు లక్షల ఎకరాల్లో సాగు నీరు ఇస్తూ వరి ఉత్పత్తిలో దేశానికి దిక్సూచిగా మారిందన్నారు. ఇలాంటి పథకాలు బీజేపీ, కాంగ్రెస్ పాలిత ప్రాంతాల్లో ఎక్కడ లేవన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మేకల కళింగ రాజు, మండల రైతు బంధు కో ఆర్డినేటర్ ప్రమోద్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్దె సిద్దిలింగం, ఎంపీటీసీ సుజాత, పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పఠనాసక్తిపై ప్రత్యేక దృష్టి సారించాలి

- డీఈఓ రాము



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈఓ

జఫర్‌గఢ్: పాఠశాలలో చేపట్టిన పఠనాసక్తిపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా విద్యాశాఖ అధికారి రాము కోరారు. మండలంలోని కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను డీఈఓ రాము మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమలవుతున్న పఠనాసక్తి, మధ్యాహ్న భోజనం సిలబస్ పూర్తి తదితర అంశాలపై ఉపాధ్యాయులతో డీఈఓ రాము చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారి విద్యాభివృద్ధికి తోడ్పడేందుకు పఠనాభివృద్ధి ఎంతో దోహదం పడుతుందన్నారు. ఉపాధ్యాయుడు చెప్పే పాఠాలను ప్రతి విద్యార్థి శ్రద్ధగా విని చదువులో రాణించాలన్నారు. ఈ విద్యా సంవత్సరం తీసుకోవాల్సిన సహపాఠ్యాంశాలు, సిలబస్ పూర్తిపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం పాఠశాల దాత పల్లె రాజిరెడ్డిని డీఈఓ రాము చేతుల మీదుగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎండీ పర్వేజ్, ఎస్ఎంసీ చైర్మన్ ఎల్లాచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీలకు స్పెషలిస్టు వైద్యులు

- నేటినుంచి అందుబాటులోకి సేవలు



వైద్యులతో సూపరింటెండెంట్ సుగుణాకర్‌రాజు

జనగామ: జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి అనుబంధంగా పని చేస్తున్న బచ్చన్నపేట, పాలకుర్తి, జఫర్‌గఢ్, స్టేషన్‌ఘన్‌పూర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు (సీహెచ్‌సీ)లకు స్పెషలిస్టు వైద్యుల కేటాయింపులు పూర్తయ్యాయి. మంగళవారం డిస్ట్రిక్ హాస్పిటల్‌లో సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్‌రాజు ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్ (ఆయా కేటగిరీలు) తదితర వైద్యులను నాలుగు సీహెచ్‌సీల వారీగా కేటాయించగా, నేటి నుంచి వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. అనంతరం సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్‌రాజు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని సర్కారు దవాఖానల్లో కార్పొరేట్‌కు ధీటుగా వైద్య సేవలు అందుబాటులో వచ్చాయ న్నారు. ప్రజలు స్పెషలిస్ట్ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ సీహెచ్‌సీకి డాక్టర్ ఏ.శ్రీనాథ్ (జనరల్ సర్జన్), డాక్టర్ పి.రజని (గైనకాలజిస్టు), డాక్టర్ టి.సుమన్‌కుమార్ (అనస్తిషియా), జఫర్‌గఢ్ సీహెచ్‌సీకి డాక్టర్ ఎస్ శ్రీధర్ (జనరల్ సర్జరీ), డాక్టర్ కె.మనోహర్ (ఫల్మనాలజీ), డాక్టర్ జి.సంగీత (అనస్తిషియా), డాక్టర్ పి.శోభారాణి (జీడీఎంఓ, గైనిక్), డాక్టర్ మల్లేష్ (పాథాలజీ), పాలకుర్తి సీహెచ్‌సీకి డాక్టర్ ఏ.స్వప్న (గైనకాలజీ), డాక్టర్ పంకజ్ కుమార్ (అనస్తిషియా) డాక్టర్ పి.రాహుల్ (ఫల్మనాలజీ), బచ్చన్నపేట సీహెచ్‌సీకి డాక్టర్ జె.స్వప్నరాథోడ్ (గైనకాలజీ), డాక్టర్ ఎస్. సత్తెయ్య (డెర్మటలాజీ), డాక్టర్ బి.రూపాదేవి (చిన్న పిల్లలు), డాక్టర్ కె.రాకేష్ (కాంట్రాక్టు/అనస్తిషియా) వైద్యులను కేటాయించారు. ప్రస్తుతం ఎంసీహెచ్‌లో పని చేస్తున్న డాక్టర్లను రిలీవ్ చేసి, కేటాయించిన సీహెచ్‌సీల్లో విధుల్లో చేరాలని ఆదేశించారు.

ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాల ముట్టడి



జనగామ: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న జీపీ కార్మికులు

జనగామ: న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం 13 రోజులుగా కొనసాగుతున్న జీపీ శానిటేషన్ కార్మికులు తలపెట్టిన ఉద్యమం ఉధృతంగా మారుతుంది. మంగళవారం జిల్లా నలుమూలల నుంచి తరలి వచ్చిన కార్మికులు ఆర్టీసీ చౌరస్తా నుంచి డప్పు చప్పుళ్లతో ర్యాలీగా హైదరాబాద్ రోడ్డులోని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. ఎస్సై సృజన్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించగా, కార్మికులు గేటు ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే ప్రతినిధి మిద్దె పాక లెనిన్‌కు వినతి పత్రాన్ని అందించారు.

స్టేషన్‌ఘన్‌పూర్‌లో..



స్టేషన్‌ఘన్‌పూర్: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించి నినాదాలు చేస్తున్న జీపీ కార్మికులు

స్టేషన్‌ఘన్‌పూర్: పదమూడు రోజులుగా సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం స్పందించపోవడాన్ని నిరసిస్తూ నియోజకవర్గ గ్రామ పంచాయతీ కార్మికుల ఆధ్వర్యంలో ఘన్‌పూర్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని మంగళవారం ముట్టడించారు. ముందుగా రైల్వేస్టేషన్ నుంచి రైల్వే అండర్ బ్రిడ్జి, శివాజీ చౌక్, గాంధీ చౌరస్తా, బస్టాండ్ మీదుగా ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ముట్టడి చేశారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌కు, ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు గూడూరు భాస్కర్ మాట్లాడుతూ తక్షణమే ప్రభుత్వం స్పందించి గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మనెంట్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జీపీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు కందాలోజు రాజు, రావుల జగన్నాథం, నాయకులు కుంభం రాజు, చిక్కుడు నాగరాజు, కొడెపాక శ్రీను, కొంతం చిరంజీవి, రాజశేఖర్, ఆనందం, రతన్‌సింగ్, ఓరుగంటి రాజు, వివేక్, ఉమ్మగోని రాజేష్, సత్యనారాయణ, యాకుబ్, మహేందర్, రేణుక, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి క్యాంపు కార్యాలయ గేటుకు వినతిపత్రం

- జేఏసీ నేతలను చర్చలకు పిలవాలని పంచాయతీ కార్మికుల డిమాండ్



పాలకుర్తిలో ఎర్రబెల్లి క్యాంపు కార్యాలయ గేటుకు వినతిపత్రం అంటిస్తున్న కార్మికులు

పాలకుర్తి: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామ పంచాయతీ కార్మికులు మంగళవారం పాలకుర్తిలోని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు క్యాంపు కార్యాలయం వద్దకు వెళ్లారు. ఆయన లేకపోవడంతో కార్యాలయ గేటుకు వినతిపత్రం అంటించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్మికుల జేఏసీ చైర్మన్ రాపర్తి రాజు మాట్లాడారు. సమస్య పరిష్కారానికి జేఏసీ నేతలను చర్చలకు పిలవాలని మంత్రి ఎర్రబెల్లిని కోరారు. ఈ కార్యక్రమంలో వర్కర్స్ యూనియ్ జిల్లా నాయకుడు బత్తిని వెంకన్న, ఏదునూరి మదార్, చిట్యాల సోమన్న, మాచర్ల సారయ్య, సోమ సత్యం, బసవ రాంచంద్రం, కర్ణాకర్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలు అవాస్తవం

- ఘన్‌పూర్ బీఎంసీయూ మేనేజర్ లింగారెడ్డి



మాట్లాడుతున్న లింగారెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్: విజయ డైయిరీ జిల్లా డీడీ ధన్‌రాజ్‌పై కొందరు పాడిరైతులు, సొసైటీల అధ్యక్షులు చేస్తున్న ఆరోపణలు అవాస్తమని ఘన్‌పూర్ పాలశీతలీకరణ కేంద్రం (బీఎంసీయూ) మేనేజర్ ఆర్.లింగారెడ్డి అన్నారు. స్థానిక పాలశీతలీకరణ కేంద్రంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ డీడీపై వస్తున్న ఆరోపణలు తీవ్రంగా ఖండించారు. ఘన్‌పూర్ బీఎంసీయూను సొసైటీ మోడ్‌లోకి మార్చడంలో డీడీ అడ్డుకుంటున్నారని, కేంద్రానికి పాలు పోసే రైతులను వద్దంటున్నాడని, పాడి రైతులను నేరచరిత్ర కలవారు అంటూ ఆరోపించారంటూ చేస్తున్న వ్యాఖ్యల్లో ఏ మాత్రం వాస్తవం లేదన్నారు. పాడిరైతులు అందరూ ఈ విషయమై అవగాహన కలిగి ఉండాలని, విజయడైయిరీకి పాలసేకరణ పెంపులో అందరూ బాధ్యతగా సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఘన్‌పూర్ పాలశీతలీకరణ కేంద్రం సూపర్‌వైజర్లు హన్మంతరావు, గోనెల రాము తదితరులు పాల్గొన్నారు.

అర్హులను ఓటరుగా నమోదు చేయాలి

- కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య



మాట్లాడుతున్న కలెక్టర్ శివలింగయ్య

జనగామ: జిల్లాలో 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకునేలా సంబంధిత అధికారులు చూడాలని కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశం హాలులో జిల్లాలోని 42 మంది అసెంబ్లీ లెవెల్ మాస్టర్ ట్రైనర్స్, అసిస్టెంట్ ఎలక్ట్రోల్ ఆఫీసర్స్‌కు రెండో దశ సమ్మరీ రివిజన్ 20–23 ఓటరు జాబితా సవరణ, నమోదు తీసుకోవాల్సిన చర్యలపై నిర్వహించిన శిక్షణ తరగతుల్లో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. జిల్లా లెవెల్ మాస్టర్ ట్రైనర్స్ ఆధ్వర్యంలో శిక్షణ తీసుకున్న ఏఎల్ఎంటీలు అసెంబ్లీ లెవెల్ మాస్టర్ ట్రైనర్స్, బూత్ లెవెల్ ఆఫీసర్స్, బూత్ లెవెల్ సూపవైజర్లకు దీనిపై అవగాహన కల్పిస్తారన్నారు. రెండో సమ్మరీ రివిజన్‌తో పాటు ఓటరు జాబితా తయారీ, సవరణలు ఖచ్చితమైన ఆధారాలతో సరి చేయాలన్నారు. ఓటర్ జాబితాను తయారు చేయడంతో పాటు ఎవరికి కేటాయించిన బాధ్యతలను వారు వాస్తవ విషయాల ద్వారా క్షేత్రస్థాయి సమాచారం సేకరించి పొందుపరచడంలో కీలకపాత్ర వహించాలన్నారు. ఈ శిక్షణ తరగతుల్లో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, రోహిత్ సింగ్, ఎన్నికల పర్యవేక్షకులు ఏతెశాం అలీ, ఎలక్షన్ సెల్ డిప్యూటీ తహసీల్దార్ శంకర్, ఎన్నికల విభాగం సిబ్బంది, తదితరులు ఉన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

లింగాలఘణపురం: స్వచ్ఛ సర్వేక్షణ్‌కు ఎంపికైన సిరిపురం గ్రామంలో ప్రతి ఇంటికి మరుగుదొడ్డి, ఇంకుడు గుంత ఉండే విధంగా చూడాలని, నిర్మాణంలో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ శివలింగయ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆకస్మికంగా వర్షంలో సిరిపురం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్‌లుగా నియమించిన జిల్లా అధికారులు గ్రామంలో చేపట్టిన పనులను పరిశీలించారు. ఈ నెల 20, 21 తేదీల్లో స్వచ్ఛ స్వరేక్షణ్ గ్రామాల పరిశీలనకు కేంద్ర బృందం రానున్నట్లు, అప్పటిలోగా పనులన్నీ పూర్తి చేయాలని కోరారు. కలెక్టర్‌తో పాటు జేసీ ప్రఫుల్‌దేశాయ్, జిల్లా అధికారులు ఉన్నారు.

లైంగికదాడి, హత్యకేసులో వ్యక్తికి జీవిత ఖైదు

కేసముద్రం: ఓ మహిళపై లైంగికదాడికి పాల్పడ్డిన అనంతరం ఆమెను హత్యచేసిన ఓ వ్యక్తికి మహబూబాబాద్ కోర్టు మంగళవారం జీవితఖైదు శిక్ష విధించినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. కేసముద్రం మండలంలో కాట్రపల్లి గ్రామానికి చెందిన మహిళ మాధవపెద్ది విజయ కేసముద్రంస్టేషన్‌లోని ఉప్పరపల్లి రోడ్డువైపు ఓ ఇంట్లో అద్దెకు ఉంటుంది. కాగా, 2011 ఆగస్టు 9న రాత్రి కరీంనగర్ జిల్లా కాటారం మండలం చెర్లపల్లి గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగి చల్లా మహేశ్.. విజయపై లైంగికదాడికి దాడికి పాల్పడిన అనంతరం ఆమెను హత్య చేశాడు. ఆ తర్వాత ఆమె మెడలో ఉన్న బంగారంతో వెళ్లిపోయాడు. దీనిపై నెక్కొండ మండలం నాగారం గ్రామానికి చెందిన మృతురాలి సోదరుడు కొంకాల వెంకట్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసముద్రం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఎస్సై డేవిడ్‌రాజ్, రూరల్ సీఐ అంజయ్య.. నిందితుడిని రిమాండ్ చేశారు. అనంతరం చార్జీషీట్ ఫైల్‌చేయగా కోర్టు డ్యూటీ ఆఫీసర్ అశోక్‌రెడ్డి, సిబ్బంది రవీందర్, దేవా.. 23 మంది సాక్షులను కోర్టులో హాజరుపరిచారు. కోర్టు పీపీ చిలకమారి వెంకటేశ్వర్లు బాధితుల తరఫున వాదించారు. ఈ మేరకు మంగళవారం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి మహబూబాబాద్ చంద్రశేఖర్‌ప్రసాద్.. నేరం రుజువు కావడంతో నిందితుడికి జీవితఖైదు శిక్షతోపాటు రూ.18వేల జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు. కాగా, నేరస్తుడికి శిక్ష పడేలా సాక్షులను ప్రవేశపెట్టిన డీఎస్పీ సత్యనారాయణ, రూరల్ సీఐ రమేశ్, ఎస్సై తిరుపతిని ఎస్పీ శరత్‌చంద్రపవార్ అభినందించారు.

భార్యను హత్య చేసిన ఘటనలో భర్తకు..


సంపత్

టేకుమట్ల(రేగొండ): జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం గాంధీనగర్ గ్రామంలో 2019లో నమోదైన హత్య కేసులో పల్లబోయిన సంపత్ అనే నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ. పదివేల జరిమానా విధిస్తూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా జడ్జి పి. నారాయణ బాబు మంగళవారం తీర్పునిచ్చారు. పల్లెబోయిన సంపత్, సుమలత దంపతులు గాంధీనగర్‌లో నివాసం ఉండేవారు. మద్యానికి బానిసైన సంపత్.. 2019 సంవత్సరంలో సుమలతతో గొడవపడి కత్తితో పొడవగా ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనపై అప్పటి సీఐ సాయి రమణ కేసు నమోదు చేసి చార్జిషీట్ ఫైల్ చేయగా, ప్రస్తుత చిట్యాల సీఐ వేణు చందర్, రేగొండ ఎస్సై శ్రీకాంత్ రెడ్డి, కోర్టు కానిస్టేబుల్ జ్యోతి సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. ఈ ఘటనలో నేరం రుజువు కావడంతో సంపత్‌కు జీవిత ఖైదుతో పాటు రూ. 10వేల జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి తీర్పును తీర్పునిచ్చారు. కాగా, ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున వాదనలు వినిపించిన పి.పి జి. శివరాజు, నిందితుడికి శిక్ష పడేలా చర్యలు చేపట్టిన రేగొండ ఎస్సై శ్రీకాంత్ రెడ్డి, చిట్యాల సీఐ వేణుచందర్, కోర్టు కానిస్టేబుల్ జ్యోతిని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ జే సురేందర్ రెడ్డి అభినందించారు.


కోచింగ్ సెంటర్‌లో క్లాస్ వింటున్న అభ్యర్థులు(ఫైల్)

కొలువు..గెలువు

- మైనార్టీ అభ్యర్థులకు సివిల్స్‌లో కోచింగ్
- దరఖాస్తుకు ఈనెల 23 వరకు గడువు
- వచ్చేనెల 6న స్క్రీనింగ్ టెస్ట్

న్యూశాయంపేట : సివిల్ సర్వీసెస్–2024 పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న మైనార్టీ అభ్యర్థులకు శుభవార్త. తెలంగాణ రాష్ట్ర మైనార్టీస్ స్టడీ సర్కిల్, మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందించనుంది. ఈ సంవత్సరంలో వందమంది అభ్యర్థులకు హైదరాబాద్‌లోని ప్రముఖ కోచింగ్ సెంటర్లలో ఉచిత శిక్షణ అందించనుంది. ఇందులో భాగంగా యూపీఎస్సీ, సీఎస్‌ఏటీ నిర్వహించే ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలకు అవసరమైన శిక్షణ అందించనున్నట్లు అధికారులు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, జైన్, బుద్దీస్, పార్శీ కులాలకు చెందిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. స్క్రీనింగ్ టెస్టులో సాధించిన మెరిట్ ఆధారితంగా కోచింగ్ సెంటర్‌లో అడ్మిషన్ ఇస్తారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఆయా జిల్లా కేంద్రాల్లో ఉన్న మైనార్టీ గురుకులాల్లో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తారు.

అర్హత..

సివిల్స్ కోసం ప్రిపేరవుతున్న అభ్యర్థులు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని జనరల్, ప్రొఫెషనల్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కుటుంబ వార్షిక ఆదాయం రూ. రెండు లక్షలకు మించొద్దు. ఈ శిక్షణలో మహిళా అభ్యర్థులకు 33, దివ్యాంగుల కు 5 శాతం రిజర్వేషన్ ద్వారా సీట్లు కేటాయించారు. ప్రవేశం పూర్తిగా మెరిట్ ప్రాతిపదికన ఉంటుంది.

దరఖాస్తుకు గడువు

సివిల్ సర్వీసెస్ స్క్రీనింగ్ టెస్ట్ కోసం డిగ్రీ పూర్తిచేసి సివిల్స్ కోసం ప్రిపేరవుతున్న అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్ డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.సీఈటీ.జీటీపీ.ఇన్/టెమ్రిస్ నందు దరఖాస్తులు సమర్పించాలి. దరఖాస్తుకు గడువు ఈ నెల 23వ తేదీ.

స్క్రీనింగ్ టెస్ట్

దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు వచ్చే నెల(ఆగస్టు 6న) స్క్రీనింగ్ టెస్ట్ ఉంటుంది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల కేంద్రాల్లోని మైనార్టీ గురుకుల పాఠశాల్లో ఈ పరీక్ష నిర్వహిస్తారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మైనార్టీలు సివిల్స్‌లో సత్తా చాటేందుకు శాఖ పరంగా చర్యలు తీసుకుంటున్నాం. ఇతర వివరాలకు 040–23236112 నంబర్‌లో గాని, ఆయా జిల్లాల మైనార్టీ సంక్షేమ అధికారి కార్యాలయాల్లో సంప్రదించాలి.

కే.విక్రమ్‌కుమార్, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి, వరంగల్

'క్రీస్తుజ్యోతి'కి ప్రపంచ స్థాయి గుర్తింపు

- మందిరం వ్యవస్థాపకులు పాల్సన్ రాజ్, జయప్రకాశ్

ధర్మసాగర్: హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం కరుణాపురం గ్రామంలోని క్రీస్తుజ్యోతి ప్రార్థనా మందిరానికి ప్రపంచస్థాయి గుర్తింపు రావడం ఎంతో అదృష్టమని మందిరం వ్యవస్థాపకులు దైవజనులు రెవరెండ్ డాక్టర్ సంగాల పాల్సన్ రాజ్, రెవరెండ్ డాక్టర్ గోపు జయప్రకాశ్ అన్నారు. ఈమేరకు మంగళవారం వారు ప్రార్థనా మందిరంలో విలేకరులతో మాట్లాడుతూ ఆసియా ఖండంలో అతిపెద్దగా సుమారు 40 వేల మంది క్రైస్తవ విశ్వాసులు ఒకేసారి దేవుడి ప్రార్థనలో గడిపేలా అన్ని హంగులతో క్రీస్తుజ్యోతి ప్రార్థనా మందిరాన్ని నిర్మించామన్నారు. దీనిని మే 4వ తేదీన ప్రారంభించామన్నారు. చర్చి ప్రత్యేకత, తమ సేవ పరిచర్యను తెలుసుకుని రెండు అంతర్జాతీయ అవార్డులకు ఎంపిక చేశారన్నారు. ఈ మేరకు జూన్ 16న యూఎస్ కాంగ్రెస్ మెన్ డానికె డేవిడ్ పీస్ ప్రైజ్ 2023, యూఎస్ హౌజ్ ఆఫ్ రిప్రజెంటివ్ కాంగ్రెస్‌నల్ రివార్డు మెడల్, ప్రశంస పత్రం యూఎస్ ఎంపీ జోనతన్ జాక్సన్ చేతుల మీదుగా అందజేశారని తెలిపారు. ఈ రెండు అంతర్జాతీయ అవార్డులు రావడం ఆనందంగా ఉందని, అవార్డులు ప్రదానం చేసిన అమెరికా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.


మాట్లాడుతున్న పాల్సన్ రాజ్

'మోడల్' టీచర్లపై విచారణ

సాక్షి ఎఫెక్ట్..


విచారణ చేపడుతున్న ఉన్నతాధికారులు

జనగామ రూరల్: మండలంలోని చౌడారం మోడల్ పాఠశాల ఉపాధ్యాయులు.. తమను మానసికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారనే విద్యార్థుల లేఖపై 'సాక్షి'లో ప్రచురితమైన 'రూపాయి బిల్లా, బాయిలా బంగారం' అనే కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం విచారణ చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన కథనంపై విద్యాశాఖ మంత్రి దృష్టికి రాగా కలెక్టర్ వెంటనే స్పందించి డీఈఓను విచారణకు ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈఓ కమిటీని నియమించారు. మంగళవారం నోడల్ అధికారి ఆధ్వర్యంలో వివిధ విద్యార్థి సంఘాల వాయిస్‌లతో విద్యార్థినులు, ఉపాధ్యాయులను విచారించారు. నివేదికను బుధవారం ఉన్నతాధికారులకు అందజేయనున్నారు.

ప్రిన్సిపాల్‌తో పాటు సంబంధిత ఉపాధ్యాయులను తొలగించాలి

మోడల్ పాఠశాలలో విద్యార్థినులను ఇబ్బందులకు గురి చేసిన ఉపాధ్యాయులతో పాటు పూర్తి బాధ్యతగా ప్రిన్సిపాల్‌ను కూడా తొలగించాలి. ఏ పాఠశాలలో కూడా ఇలాంటి ఘటన జరగకుండా చర్యలు తీసుకోవాలి.

–చిలువేరు అభిగౌడ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

హన్మకొండ: ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ అల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ తూపురాణి సీతారాం అన్నారు. మంగళవారం హనుమకొండలో అసోసియేషన్ నాయకుడు ఇ.నరేందర్ అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతోపాటు వాటిని పరిష్కరించాలనే డిమాండ్‌తో ఈ నెల 20న హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద ధర్నా చేయనున్నట్లు వివరించారు. ప్రతి నెల మొదటి తేదీన పెన్షన్లు చెల్లించడం లేదని, కార్పొరేట్ హాస్పిటళ్లలో హెల్త్ కార్డులపై వైద్యం అందించడం లేదన్నారు. జూలై 1 నుంచి వర్తించే కొత్త పే రివిజన్ కమీషన్ ఇంతవరకు వేయలేదని, బకాయి కరువు భత్య వాయిదాలను ప్రకటించలేదని మండిపడ్డారు. ఈ సమస్యలన్ని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు నారాయణగిరి వీరన్న, భేతి శంకర్ లింగం, ఆర్తి సంపత్ కుమార్, కరేటి శంకర్‌రావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీతారాం

రాష్ట్రంలో నిరంతర ఉచిత విద్యుత్


మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి: రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ రాష్ట్రంలో రోజు నిరంతరంగా ఉచిత విద్యుత్ ఇస్తుండగా.. పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి మాత్రం మూడు గంటలే ఇస్తున్నారని చెప్పడం విడ్డూరంగా ఉందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం పాలకుర్తిలో రైతులతో ఏర్పాటు చేసిన సభలో మంత్రి దయాకర్‌రావు మాట్లాడుతూ 60 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో రైతులను పట్టించుకోలేదన్నారు. మూడేళ్లలో కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ కల్పించిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ కుమార్, ఎంపీపీ నల్ల నాగిరెడ్డి, జడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు, జడ్పీకోఆప్షన్ సభ్యుడు ఎం.డి మదార్, పాలకుర్తి సర్పంచ్ వీరమనేని యాకాంతారావు, ఏఎంసీ చైర్మన్ ముస్కు రాంబాబు, సహకార సంఘం చైర్మన్ బొబ్బాల అశోక్ రెడ్డి, మాచర్ల ఎల్లయ్య, భూమ రంగయ్య పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల రాస్తారోకో


ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వద్ద రాస్తారోకో చేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు

- రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లోని కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ స్టేట్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ జాక్ (కేయూ)ఆధ్వర్యంలో మంగళవారం వర్షంలోనే హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాల వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం కళాశాల ఎదుట రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా జాక్ కన్వీనర్ డాక్టర్ చిర్రరాజు, వైస్ చైర్మన్ డాక్టర్ బి వెంకటగోపీనాథ్ మాట్లాడుతూ యూనివర్సిటీల్లో 15 నుంచి 20 సంవత్సరాలుగా కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్నామని, తమను రెగ్యులరైజ్ చేయాలని కొంతకాలంగా కోరుతున్నామన్నారు. సీఎం కేసీఆర్ గతేడాది జూలై 18న హనుమకొండకు వచ్చిన సందర్భంలో తమను రెగ్యులరైజ్ చేయాలని కోరగా చేస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీని నెరవేర్చాలన్నారు. ఇటీవల కూడా మంత్రులు ,ఇతర ప్రజాప్రతినిధులకు కూడా వినతిపత్రాలు సమర్పించామన్నారు. ఇటీవలనే ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల లెక్చరర్లు, పాలిటెక్నిక్ కళాశాలల లెక్చరర్లను రెగ్యులరైజ్ చేశారన్నారు. అలాగే, యూనివర్సిటీల కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను కూడా రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్‌చేశారు. కాగా, రాస్తారోకోతో కొంత సేపు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. కార్యక్రమంలో రాష్ట్ర జాక్ కోకన్వీనర్ డాక్టర్ మంతెన శంకరయ్య, బాధ్యులు డాక్టర్ టి రాధిక, డాక్టర్ టి నాగయ్య, డాక్టర్ భిక్షపతి, డాక్టర్ రమేశ్, శ్రీదేవి, సునీత, కనకయ్య, స్వామి, ప్రసాద్, కర్రె సదాశివ, మామిడి లింగయ్య, పుల్లా రమేశ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

పుప్పాలగుట్టలో సైకో వీరంగం

- ఇంట్లోకి చొరబడి ఓ వ్యక్తిపై దాడి
- ఆస్పత్రికి తరలింపు

ఖిలా వరంగల్: వరంగల్ పుప్పాల గుట్టలో ఓ సైకో వీరంగా సృష్టించాడు. ఓ ఇంట్లోకి చొరబడి అకారణంగా యువకుడిపై రోకలి బండతో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసుల కథనం ప్రకారం కాలనీకి చెందిన కొండేటి అంజమ్మ, సాయిలు దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు శ్రీనివాస్(33) ఉన్నారు. కాగా, ఏపీలోని కాకినాడ రామచంద్రపురం గ్రామానికి చెందిన నీలం సత్యనారాయణకు మనసిక స్థితి సరిగా లేదు. ఈ క్రమంలో వరంగల్ చింతల్ బ్రిడ్జి సమీపాన రైలు దిగి కాలనీలోకి ప్రవేశించాడు. అనంతరం అనుకోకుండా శ్రీనివాస్ ఇంటి తలుపులను బలంగా కొట్టడంతో ఊడి కిందపడ్డాయి. వెంటనే పక్కన ఉన్న రోకలి బండతో ఇంట్లోకి ప్రవేశించి శ్రీనివాస్‌పై దాడి చేయగా ఆయనకు గాయాలయ్యాయి. దీంతో స్థానికులు క్షతగాత్రుడిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. అడ్డుకోపోయిన మరో ఇద్దరిపై సైకో దాడికి పాల్పడ్డాడు. దీనిపై కుటుంబీకులు కేకలు వేయగా కాలనీ వాసులు చేరుకుని సైకోను పట్టుకుని దేహశుద్ధి చేసి మిల్స్ కాలనీ పోలీసులకు అప్పగించారు. పలుమార్లు విచారించిన సమాధానం చెప్పలేని చెప్పలేదు. కనీసం పేరు కూడా చెప్పలేని స్థితిలో ఉన్నాడు. అతడి మానసిక స్థితి సరిగా లేదని సీఐ శ్రీనివాస్ తెలిపారు. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు కాగా, సైకో దాడిలో గాయపడిన కొండేటి శ్రీనివాస్‌ను స్థానిక సామాజిక వేత్త ఎల్.శ్రీనివాస్ పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు.


స్థానికులు విద్యుత్ స్తంభానికి కట్టేసిన సైకో ఇతనే..

గంజాయి పట్టివేత కేసులో..

- ఒకరికి పదేళ్ల జైలు
- రూ. లక్ష జరిమానా

మహబూబాబాద్ రూరల్: గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన కేసులో ఒకరికి పదేళ్ల జైలు శిక్ష, రూ. లక్ష జరిమానా విధిస్తూ మహబూబాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.చంద్రశేఖరప్రసాద్ మంగళవారం తీర్పు ఇచ్చారు. మహబూబాబాద్ టౌన్ సీఐ వై.సతీశ్ కథనం ప్రకారం గతేడాది ఆగస్టు 8వ తేదీన అప్పటి టౌన్ ఎస్సై కె.క్రాంతికిరణ్ సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ చేస్తున్నారు. శ్రీనివాస సెంటర్‌లో ఒక వ్యక్తి అనుమానాస్పదంగా రెండు బ్యాగులతో కనిపించగా అతడిని విచారించారు. రెండు బ్యాగుల్లో పరిశీలించగా 5 కేజీల ఎండు గంజాయి లభించింది. ఒడిశాలోని గంజాం జిల్లా నెయాలీశ్రీనిబాసపూర్ గ్రామానికి చెందిన తపన్ గౌడ్ ఒడిశా నుంచి గంజాయిని తీసుకువస్తున్నట్లు గుర్తించారు. పట్టుకున్న గంజాయిని టౌన్ సీఐ వై.సతీశ్‌కు అప్పగించి అప్పటి టౌన్ ఎస్సై కె.క్రాంతికిరణ్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. విచారణ ద్వారా గతేడాది నవంబర్ 19న మహబూబాబాద్ జిల్లా కోర్టులో చార్జీషీటు దాఖలు చేశారు. కోర్టు డ్యూటీ అధికారులు హెడ్ కానిస్టేబల్ బీరం సంపత్‌రెడ్డి, కానిస్టేబుల్ బానోత్ మోహన్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ పక్షాన జిల్లా కోర్టు పీపీ చిలుకమారి వెంకటేశ్వర్లు కోర్టులో వాదనలు వినిపించారు. వాదనలు విన్న మానుకోట జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.చంద్రశేఖరప్రసాద్ నేరం నిరూపణ కావడంతో తపన్ గౌడ్‌కు పదేళ్ల జైలు శిక్ష, రూ. లక్ష జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. కాగా, నిందితుడికి శిక్షపడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ శరత్ చంద్ర పవార్, డీఎస్పీ సత్యనారాయణ అభినందించారు.

ఆన్‌లైన్ మోసం ..

- రూ.3.80 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు

మహబూబాబాద్ రూరల్ : టెలిగ్రామ్ యాప్ పేరుతో వచ్చిన కాల్‌ను ఓ వ్యక్తి నమ్మాడు. అనంతరం తన ఫోన్‌కు వచ్చిన లింక్‌లో రూ.3.80 లక్షలు పెట్టుబడి పెట్టి పోగొట్టుకున్నాడు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్జీవోస్ కాలనీకి చెందిన పెరుమాండ్ల శ్రవణ్‌కుమార్ సెల్ ఫోన్‌కు కొద్ది రోజుల క్రితం ఒక మెసేజ్ వచ్చింది. అధిక మొత్తంలో పెట్టుబడి పెడితే, అధిక లాభం వస్తుందని ఆ మెసేజ్‌లో ఉంది. దీంతో శ్రవణ్ కుమార్ సదరు యాప్‌లో ఈ నెల 15, 16, 17 తేదీల్లో రూ.3.80 లక్షలు పెట్టుబడిగా పెట్టాడు. ఈ క్రమంలో మంగళవారం లింక్ ఓపెన్ చూడగా తన డబ్బు వివరాలు కనిపించలేదు. దీంతో మోసపోయానని గ్రహించిన శ్రవణ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని మహబూబాబాద్ టౌన్ సీఐ వై.సతీశ్ తెలిపారు.

మాట మార్చిన ప్రేమికుడు..

- రెండేళ్ల తర్వాతే పెళ్లని బుకాయింపు..
- ప్రియురాలు, బంధువుల నిరసన

గీసుకొండ: వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలో ప్రేమ వ్యవహారం బెడిసికొట్టింది. స్థానికులు, ఇరువర్గాల బంధువుల కథనం ప్రకారం గీసుకొండకు చెందిన ఇంటర్ పూర్తి చేసిన యువతి, అదే మండలం బాలయ్యపల్లికి చెందిన డిగ్రీ చదివిన యువకుడు కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. ఈ విషయం పెద్దలకు తెలియడంతో వారి ప్రేమ వ్యవహారం వివాదంగా మారింది. సదరు యువకుడితో పాటు అతడి బంధువులు ఆ యువతితో పెళ్లికి ససేమిరా అంగీకరించకపోగా మాట మార్చి రెండేళ్ల తర్వాత పెళ్లి అంటూ బుకాయిస్తున్నారు. దీంతో యువతి, ఆమె బంధువులు సోమవారం రాత్రి ప్రియుడి ఇంటి వద్ద నిరసన తెలిపారు. రెండేళ్లు కాదు..వెంటనే వివాహం జరగాలని పట్టుబట్టారు. దీంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొనడంతో యువకుడి బంధువులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఆందోళన చేస్తున్న వారిని అక్కడి నుంచి పంపించి శాంతింపజేశారు. కాగా, సోమ, మంగళవారాల్లో ఇరువర్గాల మధ్య రాజీ చర్చలు జరిగినా అవి ఫలించలేదని తెలుస్తోంది.

వేర్వేరు చోట్ల ఏడుగురి అదృశ్యం..

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఏడుగురు అదృశ్యమయ్యారు. వరంగల్ కాశిబుగ్గలో స్నేహితుడి వద్దకు వెళ్లిన ఓ విద్యార్థి.. భర్త వేధింపులు భరించేలేక హసన్‌పర్తి మండలం మల్లారెడ్డిపల్లికి చెందిన ఓ వివాహిత తన ఇద్దరి పిల్లలతో కలిసి.. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం పెద్దముప్పారంలో ఓ యువతి.. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణ బజార్‌కు చెందిన ఆటో డ్రైవర్ .. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి జమాండ్లపల్లికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యారు. వీరి ఆచూకీ కోసం ఆయా కుటుంబాలు బంధువులు, తెలిసిన చోట్లలో వెతికారు. అయినా ఫలితం లేకపోవడంతో ఆయా పోలీసుస్టేషన్లలో ఫిర్యాదు చేశారు.

హసన్‌పర్తి : భర్త వేధింపులు భరించలేక భార్య తన ఇద్దరి పిల్లలతో కలిసి అదృశ్యమైంది. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం కేశాపూర్‌కు చెందిన బోనగిరి యాదగిరి చిన్నకూతురు మమతతో ఆరేళ్ల క్రితం హసన్‌పర్తి మండలం మల్లారెడ్డిపల్లికి చెందిన ఆళ్ల ప్రభుకు వివాహం జరిగింది. ఇతర లాంఛనాలతోపాటు వ్యవసాయ భూమిని కట్నం కింద ఇచ్చారు. వీరికి కుమారుడు అక్షర్(5),కూతురు చిచ్చు(3)ఉంది. భూమి విషయమై దంపతుల మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించి భూమికి సంబంధించిన వాటా డబ్బు కూడా ప్రభుకు అందించారు. అయినా ప్రభు మారకపోవడంతో మమత తన పిల్లలను తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీనిపై తండ్రి యాదగిరి.. భర్త వేధింపులు భరించలేక తన కూతురు మమత ఇంటి నుంచి వెళ్లిందని సోమవారం రాత్రి పోలీసుకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హసన్‌పర్తి ఎస్సై సురేశ్ తెలిపారు.

కాశిబుగ్గలో విద్యార్థి..

రామన్నపేట : కాశిబుగ్గకు చెందిన పరికిపండ్ల శ్రీధర్ కుమారుడు సిద్ధార్థ అదృశ్యమయ్యారు. ఈ నెల 14వ తేదీన రాత్రి 7 గంటలకు తన స్నేహితుడి ఇంటికి వెళ్లి వస్తానని చెప్పిన ఆ యువకుడు.. ఇంత వరకూ ఇంటికి తిరిగిరాలేదు. దీంతో తండ్రి శ్రీధర్ ఇంతేజార్‌గంజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిద్ధార్థ.. ఇంటి నుంచి వెళ్లిన సమయంలో బూడిదరంగు టీషర్టు, బ్లాక్ కలర్ నైట్ ప్యాంట్ ధరించాడు. సిద్ధార్థ ఆచూకీ తెలిసిన వారు ఇంతేజార్‌గంజ్ పీఎస్‌లో సమాచారం ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ మల్లేశ్ పేర్కొన్నారు


సిద్ధార్థ

బ్రాహ్మణ బజార్‌లో యువకుడు..

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణ బజార్‌కు చెందిన సయ్యద్ సోహెల్ అదృశ్యమయ్యాడు. సోహెల్ హైదరాబాద్‌లో టాక్సీ ఆటో నడుపుకుంటూ అక్కడే ఉంటున్నాడు. బక్రీద్ సందర్భంగా ఈ నెల 6వ తేదీన ఇంటికి వచ్చాడు. పండుగ అనంతరం హైదరాబాద్ వెళ్లాడు. అయితే సోహెల్ ఫోన్ చాలా రోజుల నుంచి కలవకపోవడంతో తండ్రి ఫైజొద్దీన్.. ఈ నెల 17వ తేదీన టాక్సీ యజమానికి ఫోన్ చేసి తన కుమారుడి గురించి ఆరా తీశాడు. సోహెల్ డ్యూటీకి రావడంలేదని యజమాని వివరణ ఇచ్చాడు. దీంతో ఫైజొద్దీన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని టౌన్ ఎస్సై ఎస్.రవి మంగళవారం తెలిపారు.

పెద్ద ముప్పారంలో యువతి..

దంతాలపల్లి: మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలంలోని పెద్దముప్పారంలో ఓ యువతి అదృశ్యమైంది. గ్రామానికి చెందిన హెచ్ ఐలయ్య, తన భార్య.. పని నిమిత్తం నెల 11వ తేదీన రాత్రి బయటకు వెళ్లి 12న ఉదయం ఇంటికి చేరుకున్నారు. అయితే ఇంటి వద్ద తమ కూతురు కనిపించకపోవడంతో పలుచోట్ల వెతికారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో ఐలయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జగదీశ్ తెలిపారు.

జమాండ్లపల్లిలో వ్యక్తి..

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి జమాండ్లపల్లికి చెందిన దొండేటి రమేశ్ అదృశ్యమయ్యాడు. రమేశ్.. నెల క్రితం భార్య సుజాతతో గొడవపడ్డాడు. దీంతో ఆమె జమాండ్లపల్లి నుంచి వెళ్లిపోయి ఖమ్మంలోని తన పెద్ద కుమారుడు నరేశ్ ఇంటి వద్ద ఉంటుంది. ఈ క్రమంలో ఈ నెల 15వ తేదీ నుంచి రమేశ్ జమాండ్లపల్లిలోని తన ఇంటి వద్ద కనిపించడం లేదు. దీనిపై రమేశ్ కుమారుడు నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్సై రాంచరణ్ మంగళవారం తెలిపారు.

పాముకాటుతో మహిళ మృతి

టేకుమట్ల(రేగొండ): పాముకాటుతో మహిళ మృతి చెందింది. ఈ ఘటన మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం లింగాలలో జరిగింది. గ్రామానికి చెందిన ముత్యాల స్వరూప(45) తన ఇంటి వద్ద గల మొక్కజొన్న కుప్పపై పరదా తొలగిస్తోంది. ఈ క్రమంలో పరదా లోపల ఉన్న పాము కాటు వేసింది. దీంతో కుటుంబీకులు వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. దీనిపై మృతురాలి భర్త రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.


స్వరూప(ఫైల్)